జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

04
శుక్రవారం
28-11-2025
WWW.DASHANEWS.COM



## ట్రాఫిక్ విధుల్లో రౌడీ షీటర్లు..

**దశ, హైదరాబాద్:** నేర చరిత్ర ఉన్నవారిలో మార్పు తీసుకువచ్చి, వారిని సమాజ సేవలో భాగస్వాములను చేసేందుకు రాచకొండ పోలీసులు ఓ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టారు. నిరంతరం నిఘా నీడలో ఉండే రౌడీషీటర్లతో ఇప్పుడు ట్రాఫిక్ నియంత్రణ విధులు నిర్వహిస్తున్నారు. వారిలో సామాజిక బాధ్యతను పెంపొందించి, నేర ప్రవృత్తికి దూరం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం తొలిసారిగా 60 మంది రౌడీషీటర్లు ట్రాఫిక్ విధుల్లో పాల్గొన్నారు. ఉప్పల్, ఎల్బీనగర్, కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో చోట 20 మంది చొప్పున వీరిని ఎంపిక చేశారు. వీరు ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్‌ను నియంత్రించడంతో పాటు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.గత కొంతకాలంగా ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, మంచి ప్రవర్తనతో ఉంటున్న వారిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగిస్తున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు మాట్లాడుతూ, రౌడీషీటర్లలో మార్పు తీసుకురావడం ద్వారా మంచి పౌరులుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని తెలిపారు.

## రెండు గంటల్లో చెన్నై



**దశ, హైదరాబాద్:** చెన్నై హైదరాబాద్ వాసుల బుల్లెట్ రైలు కల త్వరలో సాకారం కానుంది. హైదరాబాద్‌చెన్నై హైస్పీడ్ రైలు మార్గం ప్రాజెక్టు తుది అలైన్‌మెంట్ నివేదికను దక్షిణ మధ్య రైల్వే తమిళనాడు ప్రభుత్వానికి సమర్పించింది. ఇది ఇంటర్ సిటీ ప్రయాణంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానుంది. ప్రస్తుతం హైదరాబాద్ నుంచి చెన్నైకి రైలు ప్రయాణానికి దాదాపు 12 గంటలు పడుతోంది. కొత్త హైస్పీడ్ మార్గం అందుబాటులోకి వస్తే ఈ సమయం గణనీయంగా తగ్గి కేవలం 2.20 గంటలకు చేరుకుంటుంది.తమిళనాడు ప్రభుత్వం కోరిక మేరకు గతంలో గూడూరు మీదుగా ఉన్న ప్రణాళికను మార్చి తిరుపతిలో స్టేషన్‌ను చేర్చారు. తమిళనాడు రాష్ట్ర పరిధిలో మొత్తం రెండు స్టేషన్లు ప్రతిపాదించారు. తమిళనాడులో చెన్నై సెంట్రల్, చెన్నై రింగు రోడ్డు స్టేషన్ ఉంటాయి. అయితే వాణిజ్య, రవాణా సౌలభ్యం కోసం, రైల్వే శాఖ ప్రతి స్టేషన్ చుట్టూ దాదాపు 50 ఎకరాల స్థలాన్ని కోరింది.సమగ్ర ప్రాజెక్టు నివేదికపై ప్రభుత్వ ఆమోదం లభించిన నెలలోపు తుది నిర్ణయం తీసుకుంటామని చెన్నై యూనిఫైడ్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ తెలిపింది. ఈ హైస్పీడ్ నెట్‌వర్క్ నిర్మాణంలో తమిళనాడు పరిధిలో 12 కి.మీ.ల సొరంగ మార్గం ఉండనుంది. ఈ ప్రాజెక్టుకు మొత్తం 223.44 హెక్టార్ల భూమి అవసరం కాగా, ఇందులో అటవీ భూమి లేదని రైల్వే అధికారులు ధృవీకరించారు. ఈ మార్గం దాదాపు 65 రోడ్లు, 21 హైటెన్షన్ విద్యుత్తు లైన్లను దాటాల్సి ఉంటుంది. ప్రభుత్వ కన్సల్టెన్సీ సంస్థ రైట్స్ లిమిటెడ్ నిర్వహించిన సర్వేల ఆధారంగా ఈ అలైన్‌మెంట్ రూపొందించారు.దక్షిణాదిన ప్రణాళికలో ఉన్న రెండు హైస్పీడ్ మార్గాలలో ఇది ఒకటి కాగా, రెండోది హైదరాబాద్‌బెంగళూరు కారిడార్‌గా ఉంది. భూసేకరణపై జాప్యాన్ని నివారించేందుకు త్వరగా స్థలాల ఖరారు చేయాలని రైల్వేశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

## ఢిల్లీలో దిగజారిపోతున్న గాలి నాణ్యత

### 'కోర్టు ఏం మ్యాజిక్ చేయగలదు'.. ఢిల్లీ పొల్యూషన్‌పై సుప్రీంకోర్టు





**దశ , న్యూ ఢిల్లీ :** ఢిల్లీలో గాలి నాణ్యత రోజురోజుకు దిగజారిపోతున్నది. ఈ క్రమంలో ఢిల్లీలో కాలుష్య కట్టడి కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించిన సుప్రీంకోర్టు డిసెంబర్ 3న విచారించనున్నట్లు తెలిపింది. ఈ కాలుష్య సమస్యను నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది.అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇది ఆరోగ్య అత్యవసర పరిస్థితి అని సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్ చేసిన వాదనను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై విచారణ చేపట్టింది. 'కాలుష్యం విషయంలో కోర్టు ఏం మ్యాజిక్ చేయగలదు..' అని ఈ సందర్భంగా న్యాయస్థానం ప్రశ్నించింది.'ఒక న్యాయస్థానం ఏం మాయాజాలం చేయగలదు? ఢిల్లీఎన్‌సీఆర్‌కు ఇది ప్రమాదకరమని తెలుసు. అయితే పరిష్కారం ఏమిటనేది ఇక్కడ ముఖ్యం. దీనికి గల కారణాలను గుర్తించాలి. పరిష్కారాలు కేవలం ఆ రంగంలోని నిపుణుల నుంచే లభిస్తాయి. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేం ఆశిస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

## హెచ్ ఎండీఏ లేఔట్లకు 100 కోట్లు

**మొదటి పేజీ తరువాయి**

సర్వం నాశనం అయిందని శోకాలు పెట్టింది. కానీ ఇప్పుడు గులాబీ పార్టీ అధికారంలో ఉన్న దాని కంటే ఇంకా ఎక్కువకే భూములు అమ్ముడుపోతున్నాయి. కోకాపేట ప్రాంతంలో హెచ్ఎండిఏ అభివృద్ధి చేసిన భూములను వేలం వేస్తే ఎకరం ధర 137 కోట్లు పలికింది.కోకాపేట ప్రాంతంలో ఎకరం 137 కోట్లు పలకడం హై ఎండ్ ప్రైస్ అని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఊహించిన విధంగా భూములకు డిమాండ్ ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వారు అంటున్నారు. కోకాపేట ఒకప్పుడు బయటి ప్రాంతంగా ఉండేది.. అయితే బాహ్యవలయ రహదారి వల్ల ఒక్కసారిగా ఈ ప్రాంతానికి డిమాండ్ పెరిగింది.. అనేక కమర్షియల్ ప్రాజెక్టులు ఈ ప్రాంతానికి వచ్చాయి.. అందువల్లే ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. అందువల్లే బిడ్డర్లు పోటీపడి భూములను సొంతం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.. అందువల్లే ఈ స్థాయిలో ధరలు పెరుగుతున్నాయిహైటెక్ సిటీకి దగ్గరగా ఉండటం వల్ల రాయదుర్గం అనే ప్రాంతం లో భూములను వేలం వేస్తే ఎకరం ధర 117 కోట్ల పలికింది.. కోకాపేట ప్రాంతంలో ఆ స్థాయిలో ధర పలకకపోయినప్పటికీ ప్రధాన ఐటీ హబ్ ను దాటి విస్తరించడం వల్ల కోకాపేట ప్రాంతంలో భూములకు విపరీతమైన ధర ఉంది.భవిష్యత్ కాలంలో మౌలిక సదుపాయాలు, ప్రణాళిక బద్ధమైన టెక్ జోన్లు, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు కారణంగా పెట్టుబడిదారులు కోకాపేట వైపు దృష్టి సారిస్తున్నారు. హైదరాబాద్ నగరం విస్తరిస్తున్నా కొద్దీ కోకాపేట పరిసర ప్రాంతాలు ప్రీమియం పెట్టుబడి హాట్ స్పాట్ లుగా మారతాయని రియల్ ఎస్టేట్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.. "భవిష్యత్తు కాలం మొత్తం ఈ ప్రాంతం కేంద్రంగా కార్యకలాపాలు సాగుతాయి.. పెట్టుబడి వ్యూహాలు కూడా ఈ ప్రాంతం ఆధారంగానే సాగుతాయి. అందువల్లే ఇక్కడ భూములకు విపరీతమైన డిమాండ్ ఉందని" రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు.

# విల్లాల కల్చర్



### మహానగరం నలువైపులా భారీ భవన నిర్మాణాలు.
### రాయదుర్గంలో ఎకరా 177 కోట్ల రూపాయలు.
### కాస్ట్‌లీ ఏరియాలో లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌కు భారీగా డిమాండ్.

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్ మహానగరం నలువైపులా విస్తరిస్తోంది. భారీ భవన నిర్మాణాలు పెరిగిపోతున్నాయి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్స్‌లో హైరైజ్ బిల్డింగ్స్ సంఖ్య విపరీతంగా పెరిగింది. కోకాపేట, నానక్ రాంగూడ, నార్సింగి, గచ్చిబౌలి ప్రాంతాల్లో భూముల ధరలు భారీగా పెరిగాయి. రాయదుర్గంలో ఎకరా 177 కోట్ల రూపాయలు పలికింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలకు కూత వేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతమంతా అద్దాల మేడలతో రంగుల ప్రపంచంగా మారిపోయింది. విద్యుత్ కాంతులతోమెరిసిపోతుంది.కాస్ట్‌లీఏరియాలో లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌కు భారీగా డిమాండ్ ఉంది. టెకీలు.. తమ కార్యాలయాలకు దగ్గరలో ఉండే విధంగా ఇళ్లను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉండటం, ఆఫీస్‌కు దగ్గరలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు. లగ్జరీ అపార్ట్‌మెంట్స్‌కు క్రేజ్ పెరిగిందని.. దీంతో వీటి అమ్మకాల సంఖ్య పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు.మరోవైపు విల్లాల కల్చర్ కూడా పెరిగిపోయింది. విల్లా అనేది స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. అయితే పది కోట్ల రూపాయల వరకు వెచ్చించి విల్లాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కనెక్టివిటీ ఉంటే చాలు ఎంత దూరమైన వెళ్లి విల్లా కొనుగోలు చేయాలని భావిస్తున్నారు. కాలుష్య భూతానికి దూరంగా విల్లాల్లో విలాసవంతంగా జీవించేందుకు హైదరాబాదీలు మక్కువ చూపిస్తున్నారు. ఆఫీస్‌లకు దగ్గరగా ఉండాలని కోరుకునేవారు తప్పనిసరి పరిస్థితుల్లో లగ్జరీ అపార్ట్‌మెంట్స్ చూస్తున్నారు. శంషాబాద్, కిస్మత్‌పూర్, కొంపల్లి ప్రాంతాల్లో విల్లాల నిర్మాణాలు పెరిగిపోయాయి. డిమాండ్ మేరకే నిర్మాణాలు కొనసాగుతున్నాయని రియాల్టర్లు చెబుతున్నారు. విల్లాలు, అపార్ట్‌మెంట్స్ అమ్మకాల్లో దేని డిమాండ్ దానికే ఉందని నిపుణులు చెబుతున్నారు.

### గ్రూప్ 2/2019 ర్యాంకర్లకు
## భారీ ఊరట..
### సింగిల్ బెంచ్ తీర్పును సస్పెండ్ చేసిన డివిజన్ బెంచ్.



**దశ, హైదరాబాద్:** తెలంగాణ హైకోర్టులో గ్రూప్2 2019 ర్యాంకర్లకు గురువారం భారీ ఊరట లభించింది. 2019 సెలెక్షన్ లిస్టను రద్దు చేస్తూ నవంబర్ 18న సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సస్పెండ్ చేసింది. మెరిట్ లిస్ట్ చెల్లదని ప్రకటించిన సింగిల్ బెంచ్ ఆదేశాలను నిలిపివేసి ర్యాంకర్లకు తాత్కాలిక రక్షణ అందించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసిన డివిజన్ బెంచ్, ఈ కేసులో మరిన్ని వాదనలు వినాలని నిర్ణయించింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) 2015లో 1,032 గ్రూప్2 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసింది. 2016 నవంబర్‌లో జరిగిన పరీక్షల ఫలితాలు 2019 అక్టోబర్ 24న విడుదలయ్యాయి. అయితే, ఈ ఫలితాలపై తీవ్ర వివాదాలు ఏర్పడ్డాయి. ఓఎమ్ఆర్ షీట్లలో అవకతవకలు, వైటెనర్ ఉపయోగం, ఎరేసర్ మార్కులు, డబుల్ బబులింగ్ వంటివి జరిగాయని గుర్తించారు. ప్రభుత్వం నియమించిన సాంకేతిక కమిటీ 2017లో ఇలాంటి షీట్లను మూల్యాంకనం చేయకూడదని సిఫారసు చేసింది. కానీ టీజీపీఎస్సీ ఈ మార్గదర్శకాలను పాటించకపోవడంతో, అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ విషయంలో సింగిల్ బెంచ్ జస్టిస్ నాగేష్ భీమపాక నవంబర్ 18న కీలక తీర్పు ఇచ్చారు. 2019 సెలెక్షన్ లిస్టను రద్దు చేస్తూ తీరపు ఇచ్చారు. మునుపటి డివిజన్ బెంచ్ తీర్పు , సాంకేతిక కమిటీ సిఫారసులకు అనుగుణంగా పునఃమూల్యాంకనం చేయాలని, అర్హ అభ్యర్థుల జాబితాను విడుదల చేసి నియామకాలు పూర్తి చేయాలని ఆదేశించింది. ఈ ప్రక్రియను ఎనిమిది వారాల్లో పూర్తి చేయాలని గడువు విధించింది. ఈ తీర్పు 1,032 మంది ఎంపికైన అధికారులకు షాక్‌గా నిలిచింది. సింగిల్ బెంచ్ తీర్పును సవాలు చేస్తూ, పలువురు ర్యాంకర్లు , టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు. గురువారం జరిగిన విచారణలో, డివిజన్ బెంచ్ సింగిల్ బెంచ్ ఆదేశాలను మధ్యంతరంగా సస్పెండ్ చేసింది. మెరిట్ లిస్టను తాత్కాలికంగా పునరుద్ధరించడం ద్వారా, ర్యాంకర్లు తమ స్థానాలను కోల్పోకుండా ఉండేలా చేసింది. ఈ మధ్యంతర ఉత్తర్వులు ర్యాంకర్లకు పెద్ద ఊరటగా మారాయి, ఎందుకంటే ఇప్పటికే వారు ఉద్యోగాల్లో కొనసాగుతున్నారు. తదుపరి విచారణను జనవరి మొదటి వారంలో చేపడతారు. రెండు వైపులా వాదనలు మరింత వివరంగా వినాలని, అందరి హక్కులను రక్షించేలా తీర్పు ఇవ్వాలని బెంచ్ సూచించింది. ఈ వివాదం 2019లోనే మొదలైంది. ఓఎమ్ఆర్ షీట్లలో పార్ట్‌ఎ మాత్రమే మూల్యాంకనం చేయాలని సాంకేతిక కమిటీ సిఫారసు చేసినా, టీజీపీఎస్సీ పార్ట్‌బీని కూడా పరిగణలోకి తీసుకుంది. ఇది మునుపటి డివిజన్ బెంచ్ ఆదేశాలకు విరుద్ధమని అభ్యర్థులు వాదించారు.

## విద్యుత్ తీగలు తగిలి లారీకి మంటలు



**దశ, రంగారెడ్డి :** ;విద్యుత్ తీగలు తగిలి లారీకి మంటలు అంటుకున్న సంఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం కొడిచెర్ల గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే.. స్థానికుల కథనం ప్రకారం పెంజర్ల గార్రమం నుంచి మహేశ్వరం మండలం నాగారం గ్రామనికి గడ్డిని లారీలో తరలిస్తుండగా విద్యుత్ తీగలు లారీకి తగిలి మంటలు అంటుకున్నాయి. అది గమనించకుండా లారీ డ్రైవర్ కొంచెం దూరం అలానే వెళ్లాడు. స్థానికులు తెలపడంతో లారీ డ్రైవర్ లారీని పక్కనే ఉన్న పంటపొలాల్లోకి తీసుకెళ్లి ఆపాడు. మంటలు ఎక్కువకావడంతో లారీని దగ్గరలో ఉన్న ఫామ్ హౌస్ వద్దకు తీసుకెళ్లి నీళ్లతో మంటలను ఆర్పాడు. ఈ ఘటనలో లారీ వెనుక భాగం పూర్తిగా కాలిపోయింది. రోడ్డుపై గడ్డి కట్టలు పడడంతో అందులోంచి వంచిన పొగతో వాహదారులు తీవ్ర ఇబ్బందికి గురైనారు

## పేర్లు పెట్టుకోవడం తప్ప పాలమూరుకు రేవంత్ చేసింది శూన్యం: కెటిఆర్




**దశ, హైదరాబాద్:** ఉమ్మడి పాలమూరు జిల్లాలో కెసిఆర్ హయాంలో అద్భుతమైన అభివృద్ధి జరిగిందని కెటిఆర్ గుర్తుచేశారు. వలసల జిల్లాగా పేరుబడ్డ పాలమూరులో రివర్స్ మైగ్రేషన్ సాధ్యమైందన్నారు. కెసిఆర్ ప్రభుత్వం 90 శాతం పూర్తి చేసిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మిగిలిన 10 శాతం పనులను కూడా రేవంత్ రెడ్డి పూర్తి చేయలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. నర్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ వంటి రిజర్వాయర్లను పూర్తి చేసి, పంపులు ఆన్ చేసి నీళ్లు ఇచ్చిన ఘనత కెసిఆర్‌దేనని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలమూరు బిడ్డను అని చెప్పుకోవడం, ప్రాజెక్టులకు మామగారి పేరు పెట్టుకోవడం తప్ప.. ఇప్పటివరకు రైతులకు ఒక్క చుక్క నీరు కూడా ఇవ్వలేదని విమర్శించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం అని పేర్కొంటూ కెటిఆర్ కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గం రాష్ట్రంలోనే అత్యధిక వ్యవసాయ పంపుసెట్లు ఉన్న ప్రాంతమని, అక్కడ కరెంట్ కష్టాలు లేకుండా సబ్ స్టేషన్లు, ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసి 24 గంటల కరెంట్ ఇచ్చిన చరిత్ర బిఆర్ఎస్‌ది అని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంట్ కోతలు, రైతుల కష్టాలు మళ్ళీ మొదలయ్యాయని, ప్రజలు కెసిఆర్ పాలనను గుర్తుచేసుకుంటున్నారని అన్నారు. చరిత్రలో ఏ ప్రభుత్వంపైన లేనంత ప్రజా వ్యతిరేకత కాంగ్రెస్‌పై ఉందని, ప్రజల వెంట మనం ఉంటే.. వారే తిరిగి కెసిఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు, క్షేత్రస్థాయిలో పార్టీ కమిటీలను వేసుకోబోతున్నట్లు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలు, అవినీతి, హామీల వైపల్యంపై ప్రజల్లోకి వెళ్లేలా కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

## పల్లెల్లో పంచాయతీ పండగ

**మొదటి పేజీ తరువాయి**

సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో జిల్లాలో సోమవారం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లాలో రాజకీయాలు వేడెక్కాయి. 42 శాతం బీసీ రిజర్వేషన్ ప్రకారంగా కేటాయించిన స్థానాల్లో పోటీ చేసేందుకు వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రయత్నాలు చేశారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం 50 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. దీంతో రిజర్వేషన్ లు తరుమారు కావడంతో జనరల్ స్థానాల్లో కూడా బిసి వర్గాలు పోటీకి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ అయా నియోజకవర్గం ఉన్న ఎమ్మెల్యేలు ఎవరెవరిని పోటీలో నిలపలని ఆలోచన చేస్తున్నారు. జిల్లా లోని చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్లు ( కల్వకుర్తి), మహేశ్వరం, రాజేంద్రనగర్, ఇబ్రహీంపట్నం తదితర నియోజకవర్గంలో 526 పంచాయతీలు, 4668 వార్డు లను కైవసం చేసుకోవడానికి పార్టీ లు సిద్ధం అవుతున్నాయి.వీటి పరిధిలో 4682 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. ఆయా నియోజకవర్గంలో అధికార పార్టీనేతలు గెలుపు ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నాయి. దానికి తోడు ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్ కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో బీజేపీ, ఇతర పార్టీలు కలిసి పోటీ చేస్తున్నారో.. లేదో ఇంకా స్పష్టత రాలేదు. ఇప్పటికే ఆయా నియోజకవర్గంలో సర్పంచ్ అభ్యర్థులను ఎంపిక చేశారు. ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పైచేయి వివిధ పార్టీలు సాధించేందుకు సిద్ధమయ్యారు.ప్రజలు ఎప్పుడు ఎప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గరపడుతున్న తరుణంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా ఎన్నికల వాతావరణం కనిపిస్తోంది. గెలుపు గుర్రాలను బరిలో దింపేందుకు ప్రధాన పార్టీలు పావులు కదుపుతున్నాయి.రిజర్వేషన్ మాట పక్కన పెడితే ఈ సారి ఏది ఏమైనా మనం అనుకున్న అభ్యర్థి గెలుపు కోసమే పని చేయాలని రహస్య ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈసారి ప్రధాన పార్టీలకు ఎవరికి మద్దతు ఇస్తే వారిదే విజయం పొందే అవకాశాలను పార్టీలు, కొంతమంది అభ్యర్థులు చక్రం తిప్పనున్నారు.

### 42 శాతం అమలుకు ప్రతిపాదన..

తెలంగాణలో మొత్తం 12,735 గ్రామ పంచాయతీలకు బీసీలకు కేటాయించిన రిజర్వేషన్ల సంఖ్య కేవలం 2,176 మాత్రమే. అంటే 17.08% రిజర్వేషన్లు అమలు కావడం జరిగింది. కొన్ని జిల్లాలలో తీవ్ర వైవిధ్యంతో, భద్రాద్రి జిల్లాలో అతి తక్కువగా బీసీలకూ ఒక్క రిజర్వేషన్ కేటాయింపులు లేవు. మరోవైపు సిద్దిపేట జిల్లా 508 స్థానాలకు 136 కేటాయించారు. గత ఎన్నికలలో బీసీలకు 20% రిజర్వేషన్లు ఉన్నా, రొటేషన్ల వల్ల ఈసారి సంఖ్య తగ్గడం జరిగింది. ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని చాలా ప్రతిపాదనలు చేసినప్పటికీ, కోర్టు కేసులు వలన ఇప్పటివరకు ఈ రిజర్వేషన్ల అమలు నిలిపివేయాల్సి వచ్చింది. తెలంగాణ హైకోర్టు ప్రభుత్వం జారీ చేసిన 42% రిజర్వేషన్ ఆర్డర్ ను నిలిపివేసింది, కారణంగా ఇది 50% సుప్రీంకోర్టు నిర్ణయాన్ని మించిపోతుందని వాదనలు వినిపించాయి, మొత్తం రిజర్వేషన్ల శాతం 67% కు చేరువైందని తెలిపింది. ఈ సమస్యలు ఇంకా తీర్చలేకపోయాయి. ఇదే సమయంలో, ప్రభుత్వం దీనిని ప్రత్యేక జీవోల ద్వారా అమలు చేయాలని యత్నిస్తోంది, కానీ చట్టబద్ధమైన అనుమతులు ఇంకా గవర్నర్ మరియు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇలాంటి పరిస్థితులు బీసీ పదవుల కేటాయింపులో స్పష్టత లేకపోవడం, వారి రాజకీయ ప్రవేశాన్ని నిరోధించడంతో కూడా తీసుకున్నవి. ఇదే సమయంలో స్థానిక సంస్థల రాజకీయ స్వరూపంలో, సామాజిక న్యాయం విషయంలో ఈ వివాదాలు పెద్దగా ప్రతిఫలిస్తున్నాయి.

Printed and Published by B. Kalpana on behalf of Kalpana Publications.
Printed & Published at Flat No. 101, Sri Heights Apartment, Shilpi Colony, Pasumamula Road, Pedda Amberpet, Rangareddy- 50105. Editor: B. KALPANA, RNI Reg No. TGTEL/25/A4195.